ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్'



మజ్జివలసలో సర్వే చేస్తున్న వ్యవసాయశాఖ జిల్లా కన్వీనర్ పెదబాబు



స్టిక్కర్లతో మధురవాడ ఎన్టీఆర్ కాలనీలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు



జీవీఎంసీ 8వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో నాయకులు

తగరపువలస: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో ఉత్సాహంగా సాగుతోంది. మూడో రోజైన ఆదివారం భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో పలుచోట్ల గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తమకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు వివరించారు. ఇలాంటి సంక్షేమ ప్రభుత్వాలను గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. చంద్రబాబు, పవన్‌పై నమ్మకం లేదని... తమకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే రానున్న ఎన్నికల్లో ఓటు వేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఇంటి గుమ్మం ముందు, సెల్‌ఫోన్లకు స్వయంగా స్టిక్కర్లు అంటిస్తూ సర్వే బృందాలను ప్రోత్సహించారు.

- భీమిలి మండలం మజ్జివలసలో చేపట్టిన సర్వేలో వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, బోనిల శివ, తుపాకుల అప్పలరాజు, కొయ్య రామకృష్ణ, తుపాకుల సురేష్‌రెడ్డి పాల్గొన్నారు. టి.నగరపాలెం పంచాయతీలో సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి పాల్గొన్నారు.
- జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస, రజక సంతపేటలో జరిగిన కార్యక్రమాల్లో అక్కరమాని రామునాయుడు, జగుపల్లి ప్రసాద్, కుంచా శివ రామకృష్ణ, జీవీ రమణ, దుంప సాయిరెడ్డి, రొక్కం శ్రీను, సిమ్మల ప్రసన్న పాల్గొన్నారు.
- జీవీఎంసీ రెండో వార్డు రెడ్డి సంతపేట, గొల్లవీధి చిల్లపేటలో జరిగిన సర్వే కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిప్పాడ వెంకటేష్, సరగడ నాగిరెడ్డి, నీలాపు సురేష్‌రెడ్డి, చిల్ల ప్రమీల, మద్ది మహాలక్ష్మి, చేట్ల ఎర్రయ్య, జగన్నాథ ఎల్లాజీ, తెడ్లాపు అప్పలరాజు, జీరు పద్మ, చేట్ల అప్పలసూరమ్మ, చిల్ల భాస్కరరెడ్డి, బింగి కిరణ్, సరగడ శివాంజనేయరెడ్డి, చిల్ల సూరిబాబు, సరగడ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ చేపట్టిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మూడో రోజు జీవీఎంసీ 8వ వార్డులో ఉత్సాహంగా సాగింది. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పార్టీ అందించిన కిట్లు పట్టుకుని ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలను వివరించి ప్రజల మద్దతు కోరారు. మా నమ్మకం నువ్వే జగన్ అని ముద్రించిన స్టిక్కర్లను గడప గడపకు వెళ్లి అంటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు పోలిరెడ్డి, నాయకులు ఉప్పులూరి గోపి, కన్వీనర్ రమణమూర్తి, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

పీఎం పాలెం: జీవీఎంసీ 8వ వార్డు మధురవాడ ఎన్టీఆర్ కాలనీలో కార్పొరేటర్ లొడగల అప్పారావు ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి గోడలకు, సెల్‌ఫోన్లకు స్టిక్కర్లు అంటించారు. అనంతరం కార్పొరేటర్ అప్పారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో అందరూ మద్దతుగా నిలిచి జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు ముదుండి రాజేశ్వరి, గోపి తదితరులు పాల్గొన్నారు



రజక సంతపేటలో సర్వేలో వైఎస్సార్ సీపీ నాయకులు



చిల్లపేటలో సర్వేలో పాల్గొన్న గృహసారథులు, కన్వీనర్లు



వెలంపేటలో సర్వే చేస్తున్న కన్వీనర్లు, గృహసారథులు



మార్కెట్ రోడ్డులో సర్వే చేస్తున్న కన్వీనర్లు, గృహ సారథులు

11న భారీ సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ఆవిష్కరణ



సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద ఆకెళ్ల

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం ఆవరణలో ఈ నెల 11న పదహారు అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు ప్రధాన అర్చకుడు ఆకెళ్ల నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు ఈ విగ్రహం వద్ద సుబ్రహ్మణ్యస్వామి హోమం, మండపారాధన, పంచామృతాలతో అభిషేకాలు, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ స్వామీజీలు పాల్గొంటారని తెలిపారు.

కేజీబీవీకి వస్తువుల వితరణ



వాల్తేరు రౌండ్ టేబుల్ సంస్థ అందించిన వస్తువులతో కేజీబీవీ సిబ్బంది

ఆనందపురం: మండలంలోని నేతేరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి వాల్తేరు రౌండ్ టేబుల్ సంస్థ పలు వస్తువులను ఆదివారం అందజేసింది. గ్యాస్ స్టౌ, వంట పాత్రలు, క్యారమ్ బోర్డు, చెస్ బోర్డు, వాలీ బాల్, బ్యాట్‌లు అందజేశారు. వీటిని సంస్థ ప్రతినిధులు అంకిత్, విజయ్ విద్యాలయం ప్రత్యేక అధికారి చంద్రకళకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ రౌండ్ టేబుల్ సంస్థ బహుకరించిన వస్తువులు తమకు ఉపయుక్తంగా ఉంటాయన్నారు.

క్లుప్తంగా

హంస వాహనానికి రూ.1 లక్ష విరాళం



రూ.లక్ష విరాళం అందజేస్తున్న భక్తుడు శివాజీ రాజు

పద్మనాభం: పద్మనాభంలో వెలసిన అనంత పద్మనాభ స్వామికి హంస వాహనం తయారీ కోసం విశాఖపట్నానికి చెందిన భక్తుడు శివాజీ రాజు ఆదివారం రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఆలయంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబుకు శివాజీ రాజు ఈ నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, ఆలయ ప్రధాన అర్చకుడు పి.సీతారామాంజనేయస్వామి పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

వృద్ధుడి అదృశ్యం



అప్పారావు

పద్మనాభం: పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెం గ్రామానికి చెందిన లంకలపల్లి అప్పారావు (70) అదృశ్యమైనట్టు ఎస్‌ఐ భరత్‌కుమార్‌రాజు తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. మతిస్థిమితం సరిగా లేని అప్పారావు ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువుల ఇళ్లలో వెతికినా కనిపించలేదు. దీనిపై అప్పారావు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 99895 13203కు సమాచారమివ్వాలని కోరారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరు అరెస్ట్

తగరపువలస: భీమిలి నేరెళ్లవలస కాలనీ, ప్రభుత్వ మహిళా పాలిటెక్నికల్ కళాశాల సమీపంలో ఆదివారం గంజాయి సేవిస్తున్న మేరుగు సతీష్ అనే రౌడీషీటర్, కుప్ప రాజేష్ అనే వెల్డర్‌ను భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ రమణ, సిబ్బంది కలిసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి 900 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. భీమిలి ఎగువపేటకు చెందిన వీరిద్దరు ఇప్పటికే గంజాయికి బానిసలుగా మారారన్నారు. ఎస్‌ఐ తాతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

అగనంపూడి: రహదారి భద్రత నియమాలు పాటిస్తూ ప్రమాదరహిత ప్రయాణాలు సాగించాలని స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ ఎస్‌ఐ మహాలక్ష్మి సూచించారు. అగనంపూడి శ్రమశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అగనంపూడిలో రహదారి నియమాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించరాదని, వేగ నియంత్రణ పాటించాలని, జాగ్రత్తగా వాహనాలు నడపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఆటో యూనియన్ ప్రతినిధులు సత్కరించారు. అసోసియేషన్ ప్రతినిధులు సింగిడి సింహాచలం, కొయ్య నాగేష్, ఈగల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు తీసేసి ఆక్రమణకు యత్నం



పరదేశిపాలెం సర్వే నంబరు 33/1లో హెచ్చరిక బోర్డు మాయం చేసి తుప్పలు తొలగించిన దృశ్యం



పరదేశిపాలెం సర్వే నంబరు 33/1లో కొద్ది నెలల క్రితం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

- పరదేశిపాలెంలో 33/1ఏలో స్థలం చదును పనులు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ హెచ్చరిక బోర్డులతో ఆటలు ఆడుతున్నారు. ప్రభుత్వ భూమి అని నిర్ధారించిన తర్వాత కలెక్టర్ పేరుతో ఏర్పాటు చేసిన బోర్డులను కూడా మాయం చేసేసి మళ్లీ ఆక్రమణకు తెరతీస్తున్నారు. దీనికి సర్వే నంబరు 33/1ఏ ఉదాహరణ. ఇక్కడ కొద్ది నెలల క్రితం గత తహసీల్దార్ రామారావు ఆధ్వర్యంలో కంబాల కొండ రిజర్వ్ ఫారెస్టు నుంచి పరదేశిపాలెం పరిసర భూములకు నీరు ప్రవహించే గెడ్డ భూమిగా నిర్ధారించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తాజాగా ఇక్కడ కొందరు వ్యక్తులు కొద్ది రోజులుగా హెచ్చరిక బోర్డు మాయం చేసేసి తుప్పలు, డొంకలు తొలగించి చదును చేసే పనులు చేస్తున్నారు. బోర్డులు తీసేసి దర్జాగా పనులు చేస్తున్నప్పటికీ రెవెన్యూ సిబ్బందికి ఎందుకు కనిపించడం లేదన్నది పెద్ద ప్రశ్న. ఇక్కడ ప్రభుత్వ భూమి లీజుకు ఇచ్చి నర్సరీ ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. పైగా సమీపంలో బోరు ఏర్పాటు పనులు కూడా పూర్తయ్యాయని, షెడ్ల నిర్మాణానికి సిద్ధమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఈ విషయంపై వీఆర్వో మంగరాజును వివరణ కోరగా స్థలం ఆక్రమణపై ఫిర్యాదు తమ దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని చెప్పారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



లండన్ మిషన్ చర్చి సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల జియాన్ కింగ్స్ మినిస్ట్రీస్ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జార్జ్ మొల్లర్, పాస్టర్ సుందర్, సంతోష్ బోనుల, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో ఆదివారం పలుచోట్ల క్రిస్టియన్లు ఈస్టర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచి తమ పూర్వీకుల సమాధులను పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించి, కొవ్వొత్తులు, అగరబత్తీలు వెలిగించారు. ఈస్టర్ సందర్భంగా వారు సమాధుల నుంచి జీవంతో లేచి వస్తారని నమ్ముతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిట్టివలస లండన్ మిషన్ చర్చి (సీఎస్‌ఐ) సమాధుల వద్ద నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో రెవరెండ్ జాన్ కాంతయ్య, డీజే మోహన్ కుమార్ కాటన్, సంఘ పెద్దలు విలియం కేరీ, సుహాసిని, పైడమ్మ, ప్రసాద్, కుమారి తదితరులు ప్రార్థనలు చేశారు.



ర్యాలీలో జీవం గల దేవుని సంఘం ప్రతినిధులు

ప్రపంచ శాంతిని కోరుతూ క్రిస్టియన్ల ర్యాలీ

తగరపువలస: ఈస్టర్, ప్రపంచ శాంతిని కోరుతూ ఆదివారం సాయంత్రం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేటకు చెందిన జీవం గల దేవుని సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కొండపేటలో ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ కూడలి, ప్రధాన రహదారి, సంతపేట, భీమిలి రోడ్డు, కార్మికవాడ మీదుగా తిరిగి కొండపేట చేరుకుంది. వేలాది మంది క్రిస్టియన్లు పాల్గొన్న ఈ ర్యాలీని ఉద్దేశించి పాస్టర్ పీఈ అంథోని, రూత్ మాట్లాడారు. లోకంలో ప్రజలను సంరక్షించడానికి యేసుక్రీస్తు పునరుత్థానుడయ్యారన్నారు. ర్యాలీలో సంఘ ప్రతినిధులు ప్రత్యేక పాటలు ఆలపించారు.

మేహాద్రిగెడ్డ కాలువలో యువకుడి మృతి

సింహాచలం: మేహాద్రిగెడ్డ కాలువలో ఈతకు దిగి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మారికవలస ప్రాంతానికి చెందిన ఎస్.నిఖిల్‌వంశీ(20) ఆటో డ్రైవరుగా పనిచేస్తూ ఒక ఈవెంట్స్ కంపెనీలో కూడా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి మేహాద్రిగెడ్డకు వెళ్లాడు. అక్కడ కాలువలో ఈతకు దిగి మునిగిపోయాడు. సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14 నుంచి ఇంటింటికీ సీపీఐ, సీపీఎం



రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తగరపువలస: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 31 వరకు నియోజకవర్గ పరిధిలో ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు అన్నారు. స్థానిక గుజ్జు రామునాయుడు భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మతోన్మాద విధానాలతో పాలన సాగిస్తోందన్నారు. నూతన ఆర్థిక విధానాలకు అనుగుణంగా నిత్యావసర సరకుల ధరలు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందన్నారు. నష్టాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారన్నారు. మైనారిటీలు, ఆదివాసీలు, దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం, గోస్తనీ నదిపై చెక్‌డ్యామ్‌లు, రైతుబజారు ప్రారంభించాలని కోరారు. అనంతరం కమ్యూనిస్ట్ నాయకుడు చండ్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమాలలో సీనియర్ నాయకులు అల్లు బాబూరావు, కానూరి రాంబాబు, నూలు ఆదినారాయణ, మోర అప్పలరాజు, మావూరి వీర్రాజు, అల్లం గోవిందరావు, మాదాబత్తుల గోవిందరావు, మామిడి సన్యాసిరావు, కానూరి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

1,230 మంది దివీస్ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న దివీస్ ఉద్యోగులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 1,230 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. దివంగత జనరల్ మేనేజర్ సత్యచంద్ర దివి జ్ఞాపకార్థం పదేళ్లుగా ఏప్రిల్ 9న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటి వరకు 6,500 మంది ఉద్యోగులు రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు. ఉత్తరాంధ్రకు చెందిన న్యూ లైఫ్, ఏఎస్ రాజా, రోటరీ, ఎన్టీఆర్, లైఫ్‌షేర్, రెడ్‌క్రాస్, లయన్స్ బ్లడ్ బ్యాంకుల ద్వారా రక్తాన్ని రోగులకు వినియోగిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దివీస్ వైస్ ప్రెసిడెంట్లు ఎస్.దేవేంద్రరావు, ఎల్‌వీ రమణ, జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, సురేష్‌బాబు, పున్నారావు, రామకృష్ణ, డీజీఎం ప్రభాకరరావు, సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల ప్రతినిధి పి.మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతో జీవితం ఆనందమయం

గాజువాక: శాకాహారంతో జీవితం ఆనందమయం అవుతుందని 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత అన్నారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్, రత్నాలమ్మ పాపినాయుడు పిరమిడ్ ధ్యాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శాకాహార సద్భావన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని, శాకాహారం తీసుకోవడం, ధ్యానం, యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు మీసాల శివ గణేశ్వరరావు, సభ్యులు అప్పల నర్సమ్మ, పుష్ప, పీఎస్ఎన్ మూర్తి, సుబ్రహ్మణ్యరాజు, జగదీశ్వరి, అప్పలరాజు, సురేష్, బాలాజీ, రామారావు, రమణారావు, రాజేశ్వరి, కళావతి, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కులాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



సంఘీభావం ప్రకటిస్తున్న వీవర్స్ ఫెడరేషన్ నాయకులు

గాజువాక: రాష్ట్రంలో 18 శాతంగా ఉన్న చేనేత కులాలకు ప్రభుత్వాలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనంద్ ప్రసాద్ డిమాండ్ చేశారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన సమస్త చేనేతల ఉత్తరాంధ్ర సర్వసభ్య సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలున్నప్పటికీ ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా చేనేతలకు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో చేనేతలను గుర్తించాలని, లేని పక్షంలో చూస్తూ ఊరుకోబోమన్నారు. వీవర్స్ ఫెడరేషన్ ఉత్తరాంధ్ర నాయకుడు పప్పు రాజారావు, నాయకులు మహేష్ సమతం, తెడ్లపు వెంకటేశ్వరరావు, గుంటుక చంద్రశేఖర్, పప్పు దుర్గ రమేష్, ఆకిన వసంతకుమార్, కొప్పల రామ్‌కుమార్, రాపర్తి సుబ్బారావు, వానపల్లి సత్య, కర్రా రవి పాల్గొన్నారు.

పార్కు స్థలంలో ఇష్టానుసారంగా నిర్మాణాలు

- నిద్ర నటిస్తున్న జీవీఎంసీ అధికారులు



మిథిలాపురి వుడా కాలనీ పార్కులో నిర్మించిన దుకాణం

మధురవాడ: జీవీఎంసీ పార్కుల్లో అభివృద్ధి, నిర్వహణ పనులు ఎవరు చేపట్టాలన్నా ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. కానీ మధురవాడ జోన్ – 2లో మాత్రం టీడీపీ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అత్త సొమ్ము అల్లుడి దానం అన్నట్టు ప్రభుత్వ పార్కులోనే పాగా వేసేందుకు తెరతీశారు. జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీకి చెందిన ప్రభుత్వ పార్కులో టీడీపీ కార్పొరేటర్ భర్త పిల్లా వెంకటరావు అక్రమంగా దుకాణం నిర్మించి తన కుమారుడు పిల్లా భరత్‌కుమార్ జ్ఞాపకార్థం అని బోర్డు పెట్టుకున్నాడు. పైగా ఇందులో వ్యాపార కార్యకలాపాలు కూడా ప్రారంభించేశారు. వీరి తీరును చూసి పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా తమకి ఏమీ తెలియదన్నట్టు జీవీఎంసీ అధికారులు నిద్ర నటిస్తున్నారు. తమకి కావాల్సిన వారు ఏం చేసినా వీరికి చీమ కుట్టినట్టు అయినా ఉండడం లేదని స్థానికులు అంటున్నారు. దీనిపై స్థానిక అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగోతి బాష అన్నారు.

కేంద్రం వైఖరి దుర్మార్గం



ఉక్కు రిలే దీక్షలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టి ఏళ్లు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం చలించకపోవడం దుర్మార్గమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి 787వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో ఇంటక్ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శిబిరాన్ని ఉద్దేశించి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే దేశంలో ఏ సంస్థ మిగలదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే దేశం ఆర్థికంగా మరింత దిగజారిపోతుందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వంద యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాతలకు పత్రాలు అందిస్తున్న నిర్వాహకులు

అగనంపూడి: తమతోపాటు చదువుకొని, ఆడుతూ పాడుతూ తిరిగిన మిత్రుడు రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడంతో చలించిన మిత్ర బృందం రక్తదానం చేసి పది మంది ప్రాణదానానికి దోహదపడ్డారు. అగనంపూడికి చెందిన కొశిరెడ్డి గుణశేఖర్ ఈ నెల 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గుణశేఖర్‌తో బాల్యం నుంచి చదువుకొని ప్రస్తుతం ఇంజినీరింగ్ చేస్తున్న విద్యార్థులు ఆదివారం అగనంపూడిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వంద యూనిట్ల రక్తదానం చేశారు.